క్లుప్తంగా

చైర్మన్‌కు సన్మానం



మోపాల్(నిజామాబాద్‌రూరల్): హైదరాబాద్ గాంధీ భవన్‌లో జరిగిన గిరిజన పార్లమెంటరీ కో–ఆర్డినేటర్ సమావేశంలో నూతనంగా నియమితులైన గిరిజన కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్‌ను కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు కెతావత్ యాదగిరి శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బెల్లయ్య నాయక్‌ను శాలువాతో సన్మానించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ప్రకాశ్ నాయక్ ఉన్నారు.

శివాజీ విగ్రహ ఏర్పాటుకు విరాళం



సిరికొండ: మండల కేంద్రంలో ఏర్పాటు చేయనున్న శివాజీ మహరాజ్ విగ్రహ ఏర్పాటుకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేష్ రూ.10 వేల విరాళం అందచేశారు. పార్టీ మండలాధ్యక్షుడు అల్లూరి రాజేశ్వర్‌రెడ్డి, వీడీసీ చైర్మన్ బడాల సంతోష్, శివాజీ సేన కమిటీ నాయకులు ధర్పల్లి బాబూరావు, మారుతి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య శాఖలో ఏవోగా చందర్ నాయక్



నిజామాబాద్‌నాగారం: వైద్యారోగ్య శాఖ ఇన్‌చార్జి ఏవోగా చందర్ నాయక్ నియమితులయ్యారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి ఏవోగా విధులు నిర్వహిస్తున్న గంగాధర్‌పై అవినీతి ఆరోపణ రావడంతో ఏవో బాధ్యత నుంచి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుదర్శనం తప్పించారు. గంగాధర్‌పై గతంలో కూడా కలెక్టర్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. పలు పోస్టుల నియామకల్లో అవకతవకలకు పాల్పడినట్లు తెలిసింది. డిప్యుటేషన్ల విషయంలో కూడా ఆరోపణలు వచ్చాయి. జిల్లా కలెక్టర్ సీరియస్ కావడంతో డీఎంహెచ్‌వో సుదర్శనం, గంగాధర్‌ను ఏవో పోస్ట్ నుంచి తప్పించారు. కుష్టు నియంత్రణ అధికారిగా విధులు నిర్వహిస్తున్న చందర్ నాయక్‌కు ఏవోగా బాధ్యతలు అప్పగించారు.

సంస్మరణ సభను విజయవంతం చేయండి



నిజామాబాద్‌నాగారం: సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర నాయకులు, అమరుడు గంగుల నర్సయ్య సంస్మరణ సభ ఆదివారం మాధవనగర్‌లోని నర్సన్న కాలనీలో నిర్వహిస్తున్నామని సీపీఐ(ఎంఎల్), ఏఐఎఫ్టీయూ(న్యూ) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భామండ్ల రవీందర్ పేర్కొన్నారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. సంస్మరణ సభకు అతిథులుగా సీపీఐ(ఎంఎల్) కేంద్ర కమిటీ సభ్యులు గుర్రం విజయ్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి ప్రసాదన్న, తదితరులు హాజరుకానున్నారు. తెలంగాణ రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మల్లేష్, సత్యనారాయణ, పంజాల నరసింహులు, తాటికొండ విఠల్, రామచందర్, రాజు ఉన్నారు.

బోర్గాం(పి)లో పోషణ్ అభియాన్



మోపాల్(నిజామాబాద్‌రూరల్): నగర శివారులోని బోర్గాం(పి) అంగన్‌వాడి కేంద్రంలో పోషణ్ పక్వాడ్‌లో భాగంగా పోషణ్ అభియాన్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు చిరు ధాన్యాలు, పోషకాహారం, తదితర అంశాలపై సీడీపీవో సౌందర్య వివరించారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటే పిల్లల్లో ఎదుగుదల బాగుంటుందని తెలిపారు. అనంతరం సీమంతాలు, అన్నప్రాశన, వెల్ బేబీ షో, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆశిష్, సూపర్‌వైజర్ స్వరూప, అంగన్‌వాడీ టీచర్లు, ఐకేపీ సభ్యులు పాల్గొన్నారు.

జన్మదిన వేడుకలు



నిజామాబాద్‌నాగారం: నగరంలోని మారుతినగర్‌లో గల స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్ దివ్యాంగుల పాఠశాలలో శనివారం జిల్లా పరిషత్ చైర్మన్ విఠల్‌రావు మనవరాలు లిఖిత జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థులతో కేక్ కట్ చేశారు. విఠల్ రావు మాట్లాడుతూ.. తమ కుటుంబ సభ్యులు ఏ కార్యక్రమాలున్నా స్నేహ సొసైటీలోని దివ్యాంగుల పాఠశాలలో నిర్వహించుకుంటామన్నారు. అన్నదానం చేశారు. స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్ధయ్య, ప్రిన్సిపల్ జ్యోతి, వైస్ ప్రిన్సిపల్ రాజేశ్వరి పాల్గొన్నారు.

రైతును రాజు చేయడమే లక్ష్యం

- వసుపు బోర్డు పేపర్‌కే పరిమితమైంది
- బీఆర్ఎస్ కోలుకునే పరిస్థితి లేదు
- నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



కాంగ్రెస్‌లో చేరుతున్న మాజీ జెడ్పీటీసీ మోహన్



ప్రమాణస్వీకారం చేస్తున్న చైర్మన్ గంగారెడ్డి

మోపాల్(నిజామాబాద్‌రూరల్): దేశంలో రైతును రాజు చేయడమే కాంగ్రెస్ లక్ష్యమని, కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే జనాభా ప్రాతిపదికన బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పిస్తామని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని సొసైటీ చైర్మన్ గ్యానాజి గంగారెడ్డి ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ అభ్యర్థిని 50 వేల మెజార్టీతో గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత డీసీసీబీ, మున్సిపాలిటీ, 20 సొసైటీలను కైవసం చేసుకున్నామని గుర్తు చేశారు. వంద రోజుల్లోనే 5 గ్యారంటీలను అమలుచేశామని, పంట బీమా చెల్లించకపోవడంతో రైతులకు పరిహారం అందలేదని, కాంగ్రెస్ రైతుల పక్షాన పంట బీమా చెల్లించి వారిని ఆదుకుంటుందని తెలిపారు. మంచిప్ప 20, 21 ప్యాకేజీపై ఇంజనీరింగ్ నిపుణులతో చర్చించి రూరల్ నియోజకవర్గంలో ఒక్క గుంట కూడా ఎండిపోకుండా సాగునీరందిస్తామని పేర్కొన్నారు.

చక్కెర కర్మాగారాల పేరుతో కొత్త నాటకాలు

ఎంపీ అర్వింద్ గతంలో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తానని బాండ్ రాసిచ్చారని, ఐదేళ్లు గడిచినా కేవలం పేపర్‌కే పరిమితమైందని భూపతిరెడ్డి ఎద్దేవాచేశారు. మళ్లీ చక్కెర కర్మాగారాలను తెరిపిస్తానని బాండ్ పేపర్ రాసిస్తూ కొత్త నాటకానికి తెరలేపారని ఆరోపించారు. కవిత జైలుకెళ్లిందని, కేటీఆర్ త్వరలో అమెరికా వెళ్తాడని, ఇక బీఆర్ఎస్ కోలుకునే పరిస్థితి లేదన్నారు.

వైఎస్ నిర్ణయాలతోనే సొసైటీల మనుగడ..

గతంలో సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాలతోనే నేడు సొసైటీలు మనుగడ సాధిస్తున్నాయని పీసీసీ ప్రధాన కార్యదర్శి కె నగేష్‌రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్‌తోనే రైతులకు ప్రయోజనం చేకూరుతోందని, కాంగ్రెస్ రైతు పక్షపాతి అని తెలిపారు. అనుభవమున్న చైర్మన్ ఉంటేనే సొసైటీ అభివృద్ధికి దోహదమన్నారు. రూ.22 లక్షలతో సొసైటీ లాభాల్లో ఉందన్నారు. అనంతరం మాజీ జెడ్పీటీసీ కెతావత్ మోహన్ నాయక్, దేవిదాస్ ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. అంతకు ముందు చైర్మన్‌గా గ్యానాజీ గంగారెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు.

ఈ కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్, కిసాన్ ఖేత్ అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, ఎస్టీ సెల్ అధ్యక్షుడు కెతావత్ యాదగిరి, మండల అధ్యక్షుడు ఎల్లోల్ల సాయిరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి



ముదక్‌పల్లిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో

మోపాల్(నిజామాబాద్‌రూరల్): పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు అసౌకర్యాలకు గురి కాకుండా మెరుగైన వసతుల కల్పనకు కృషి చేయాలని నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్ర కుమార్ సూచించారు. శనివారం ముదక్‌పల్లి, మంచిప్ప, అమ్రాబాద్, ఎల్లమ్మకుంట, బైరాపూర్, కాల్పోల్ గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను తహశీల్దార్ రామ లింగేశ్వర్, ఆర్ఐ రాజేశ్వర్‌తో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ బూత్‌లలో తాగునీరు, లైటింగ్, ర్యాంపులు, వీల్ చైర్లు, తదితర సౌకర్యాలు కల్పించాలని ఆర్డీవో ఆదేశించారు. అనంతరం ముదక్‌పల్లి జెడ్పీహెచ్ఎస్‌లో జరుగుతున్న పదోతరగతి పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు. ఎలాంటి మాస్ కాపీయింగ్‌కు అవకాశమివ్వకుండా పరీక్షలు నిర్వహించాలని సీఎస్, డీవోలకు సూచించారు.

కార్మికురాలిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలి



డీఈవో దుర్గాప్రసాద్‌కు వినతి పత్రం ఇస్తున్న భోజన కార్మికుల సంఘం నాయకులు

నిజామాబాద్‌అర్బన్: సోంపేట ప్రాథమిక పాఠశాలకు చెందిన మధ్యాహ్న భోజన కార్మికురాలిని అకారణంగా తొలగించారని, వెంటనే విధుల్లోకి తీసుకోవాలని శనివారం తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం నాయకులు డీఈవో దుర్గాప్రసాద్‌ను కోరారు. ఈ మేరకు ఆయనకు వినతి పత్రం ఇచ్చారు. మండల విద్యా శాఖాధికారి, విద్యా కమిటీ, కొందరు గ్రామస్తులు కావాలని ఏజెన్సీని తొలగించారని వారు పేర్కొన్నారు. 22 ఏళ్ల నుంచి పనిచేస్తున్న కార్మికురాలిని మానసిక, ఆర్థిక ఒత్తిళ్లకు గురి చేసి ఏజెన్సీని తొలగించడం సరైంది కాదన్నారు. వెంటనే తొలగించిన కార్మికురాలిని విధుల్లోకి తీసుకోవాలన్నారు.



ధర్నాచౌక్‌లో ఆందోళన చేస్తున్న వామపక్ష పార్టీలు

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

ఖలీల్‌వాడి: కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్ వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్ బాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్, సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ మాట్లాడుతూ.. బీజేపీపై వస్తున్న వ్యతిరేకతను దృష్టి మరల్చటానికి సీబీఐ, ఈడీ, ఐటీ వంటి దర్యాప్తు సంస్థలను ప్రతిపక్షాలపై ప్రయోగించి ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆరోపించారు. నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోని బీజేపీ ప్రభుత్వం కూడా ప్రజల తిరస్కరణకు గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. రాబోయే ఎన్నికల్లో మోదీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు గుణపాఠం చెప్పాలన్నారు. నాయకులు వెంకటేష్, సూరి, సుజాత, అనిల్, విగ్నేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళులు



తెయూలో నివాళులర్పిస్తున్న ఏబీవీపీ నేతలు



తెయూలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో..



నగరంలో సీపీఐ ఆధ్వర్యంలో..

స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ వర్ధంతి కార్యక్రమాన్ని నిజామాబాద్ అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లో పలు చోట్ల శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో పలు విద్యార్థి సంఘాల నాయకులు, రాజకీయ పార్టీల, కార్మిక సంఘాల నేతలు పాల్గొని ప్రసంగించారు. భగత్ సింగ్ పోరాట స్ఫూర్తి విద్యార్థులకు ఆదర్శం కావాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య పోరాటంలో భగత్ సింగ్‌తో పాటు రాజుగురు, సుఖ్‌దేవ్‌లు అమరులయ్యారని తెలిపారు. వారు దేశం కోసం ప్రాణాలర్పించారని, వారిని దేశ ప్రజలు ఎన్నటికీ మరిచిపోరని కొనియాడారు.

– సాక్షి నెట్‌వర్క్



ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో..



నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు



నగరంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో..



బజరంగ్‌దళ్, వీహెచ్‌పీ ఆధ్వర్యంలో..



గద్కోల్‌లో నివాళులర్పిస్తున్న మాస్‌లైన్ నాయకులు



కొండాపూర్‌లో..

సంబరంగా హోలీ వేడుకలు



కిడ్స్ పార్క్ పాఠశాలలో హోలీ సంబరాలు



ఫ్యూచర్‌లైన్ స్కూల్లో ..

నిజామాబాద్‌అర్బన్: ఆర్యనగర్‌లో ఫ్యూచర్ లైన్ స్కూల్లో శనివారం హోలీ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ స్వప్న, హోలీ విశిష్టత గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు, నృత్యాలు చేస్తూ పండుగను జరుపుకున్నారు. ఉపాధ్యాయులు సుమలత, మంజుల, గౌతమి, సంధ్యా రాణి పాల్గొన్నారు.

సిరికొండ: మండల కేంద్రంలోని కిడ్స్ పార్క్ పాఠశాలలో హోలీ వేడుకలు నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ జాకీర్ హుస్సేన్, హెచ్ఎం సయ్యద్ ఆసిఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో కామదహనాలు

నిజామాబాద్‌రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శనివారం కామ దహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ఆచార వ్యవహారాల ప్రకారం డప్పువాయిద్యాలతో గ్రామ ప్రధాన కూడళ్ల మధ్యలో కార్యక్రమం చేశారు. ఆదివారం హోలీ పండుగను జరుపుకోనున్నట్లు వారు పేర్కొన్నారు.

ఘనంగా ఇఫ్తార్ విందు

మోపాల్: నర్సింగ్‌పల్లిలో గల ఫంక్షన్ హాల్లో రంజాన్ పవిత్ర మాసం పురస్కరించుకుని శనివారం సాయంత్రం ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ హాజరై మాట్లాడారు. ముస్లింల సంక్షేమానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సీనియర్ నాయకులు శేఖర్ గౌడ్, ముప్ప గంగారెడ్డి, దిలావర్ హుస్సేన్, కాలూరు భోజన్న, ఎల్లోల్ల సాయిరెడ్డి, ముస్లిం మతపెద్దలు, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆల్ఫోర్స్ కళాశాలకు గుర్తింపు లేదు

నిజామాబాద్‌అర్బన్: ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాలకు బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ నుంచి ఇంత వరకు ఎలాంటి గుర్తింపు రాలేదని జిల్లా ఇంటర్ విద్యాధికారి రఘురాజ్ స్పష్టం చేశారు. పలు విద్యార్థి సంఘాల ఫిర్యాదు మేరకు తాము పరిశీలన చేశామన్నారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్లకు ఇంకా అనుమతి ఇవ్వలేదని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించి గుర్తింపు పొందిన కళాశాలలో మాత్రమే చేర్పించాలని స్పష్టం చేశారు.

జోరుగా పన్నుల వసూలు



పన్నులు వసూలు చేస్తున్న మున్సిపల్ అధికారులు

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ నగరంలో డిప్యూటీ కమిషనర్ రాజేంద్రకుమార్, ఆర్‌వో నరేందర్ ఆధ్వర్యంలో ఆస్తి పన్ను వసూళ్ల కోసం ప్రత్యేకంగా పర్యటిస్తున్నారు. వ్యాపార సంస్థలు, షాపింగ్ మాల్స్‌లోకి వెళ్లి ఆస్తి పన్ను బకాయిలు కట్టిస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం మరో 8 రోజుల్లో ముగుస్తున్నందున.. బకాయిల వసూళ్ల కోసం నిరంతరం తిరుగుతున్నారు.

బకాయిలు త్వరగా చెల్లించండి

నిజామాబాద్‌నాగారం: నగర పరిధిలో బకాయిలు వెంటనే చెల్లించాలని, వడ్డీపై 90 శాతం మాఫీ ఉందని వెంటనే చెల్లించాలని కమిషనర్ మకరందు శనివారం తెలిపారు. నగర పరిధిలో నీటి బిల్లు, ట్రేడ్ లైసెన్స్, యూజర్ చార్జీలు వెంటనే చెల్లించాలన్నారు

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	68,000	వెండి (కిలో)	78,400
22 క్యారెట్స్	62,715	– నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు(రూ.)


	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	08	16	గాజరుగడ్డ	30	50
బెండకాయ	30	50	పచ్చిమిర్చి	50	80
బీరకాయ	30	50	దోసకాయ	20	40
దొండకాయ	20	40	ఆలుగడ్డ	16	30
చిక్కుడుకాయ	30	60	గోబిగడ్డ	20	40
కాకరకాయ	40	60	గోబిపువ్వు	50	70
వంకాయ	40	60	బీట్‌రూట్	20	40
పాలకూర	10	20	కరివేపాకు	40	60
మెంతికూర	20	40	చామగడ్డ	50	70
కొత్తిమీర	50	70	గోరుచిక్కుడు	40	60
పుదీనా	40	60	బిక్కుడుకాయ	50	70
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సిడ్	200
		లైవ్	180
స్కిన్‌లెస్	240	మటన్	800

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	ఓం భీమ్ బుష్ (తెలుగు) - 1.45, 7.30, 10.30, ప్రేమలు (తెలుగు) - 4.30
స్క్రీన్-2	రజాకార్ (తెలుగు) - 10.25, 4.30 లైన్‌మన్ (తెలుగు) - 1.40, భీమా - 7.40, ప్రేమలు (తెలుగు) - 10.30
స్క్రీన్-3	రజాకార్ (తెలుగు) - 1.40, 10.40, లైన్‌మన్ - 7.35

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	ఓం భీమ్ బుష్ (తెలుగు) - 3.50, 10.15, ప్రేమలు (తెలుగు) - 7.00, సైతాన్ (హిందీ) - 12.50
స్క్రీన్-2	కుంగ్ ఫూ పాండా (ఇంగ్లీష్) - 5.10, 7.30, ప్రేమలు (తెలుగు) - 1.30 సైతాన్ (హిందీ) - 9.50
స్క్రీన్-3	లైన్‌మన్ (తెలుగు) - 7.10, 10.00, యమధీర (తెలుగు) - 1.10, యోధ (హిందీ) - 4.10
స్క్రీన్-4	గామి (తెలుగు) - 3.20 రజాకార్ (తెలుగు) - 12.05, 6.30, 9.45
దేవి	ప్రేమలు (తెలుగు)
నటరాజ్	నువ్వు నేను (తెలుగు)
లలితామహల్	ఓం భీమ్ బుష్ (తెలుగు)
విజయ్	రజాకార్ (తెలుగు)

ప్రయాణం నరకం

- నిధులు మంజూరైనా ప్రారంభం కాని పనులు
- బర్దీపూర్ బైపాస్ రోడ్డుకు మోక్షం ఎప్పుడో?
- నూతన బీటీ రోడ్డు కోసం ఎదురు చూస్తున్న గ్రామ ప్రజలు
- వాహనదారులకు తప్పని ఇబ్బందులు



గుంతలమయమైన బర్దీపూర్ - నిజామాబాద్ రహదారి

నిజామాబాద్ రూరల్: మున్సిపాలిటీలో విలీనమైనా డిచ్‌పల్లి మండలంలోని బర్దీపూర్‌లో రోడ్ల పరిస్థితి ఇంకా అధ్వానంగానే ఉంది. గ్రామం నుంచి కేశాపూర్, నిజామాబాద్ వెళ్లే హైవే–63 వరకు ఉన్న రోడ్డు, అదే విధంగా బర్దీపూర్ నుంచి ఆరేపల్లి వరకు నూతనంగా రోడ్లు మంజూరైనా ఇంకా పనులు ప్రారంభం కాలేదు. రోడ్డు గుంతలమయంగా ఉండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. బీఆర్ఎస్ పార్టీ హయాంలో ఈ రోడ్డుకు రూ.60 లక్షలు మంజూరయ్యాయి. కానీ ఇప్పటి వరకు పనులు మొదలు కాలేదు. ఈ రోడ్డుపై ప్రయాణం చేస్తే బండరాళ్లపై వాహనాలు పోయినట్లే అనిపిస్తుంది. ఆరేపల్లి, బర్దీపూర్ గ్రామస్తులు తమ పంట పొలాలకు ఈ రోడ్డుగుండా రాకపోకలు సాగిస్తుంటారు. అదేవిధంగా ఈ రోడ్డు వెంబడి వస్తే బర్దీపూర్ గ్రామస్తులకు జిల్లా కేంద్రం కేవలం ఐదు కిలోమీటర్లు మాత్రమే వస్తుంది. ధర్మారం మీదుగా నిజామాబాద్ వస్తే తొమ్మిది కిలోమీటర్లు తిరిగి రావాలి. దీనితో సమయంతో పాటు ఇంధనం కూడా ఎక్కువ కావాలి. బర్దీపూర్ నుంచి డాక్టర్ వెంచర్ మీదుగా వస్తే ప్రయాణికులకు 4 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. కానీ ఈ రోడ్డులో అడుగడుగునా గుంతలే. ఈ రోడ్డు గురించి ప్రజాప్రతినిధులు గానీ, అధికారులు గానీ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

బాగా ఇబ్బంది పడుతున్నాం

బర్దీపూర్ నుంచి డాక్టర్ వెంచర్ మీదుగా నిజామాబాద్ వెళ్లే రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. అధికారులు వెంటనే స్పందించి నూతనంగా బీటీ రోడ్డు వేయాలి. నిధులు పుష్కలంగా ఉన్నా రోడ్డు వేయకపోవడం విచారకరం. ప్రయాణికులు రైతులు ఈ రోడ్డు గుండా ప్రయాణిస్తే నరకం చూస్తున్నారు.

– సిరికొండ రాజారెడ్డి, బర్దీపూర్

వరి కోతలు మొదలైతే నరకమే

వారం రోజుల్లో వరికోతలు మొదలు కానున్నాయి. ట్రాక్టర్లు, డీసీఎంలు, హార్వెస్టర్లు, ధాన్యం లోడ్ లారీల వంటి వాహనాలు ఈ రోడ్డు గుండా ప్రయాణం చేస్తాయి. దీంతో రోడ్డు మరింత ధ్వంసమయ్యే అవకాశం ఉంది. అధికారులు స్పందించి నూతనంగా బీటీ రోడ్డును త్వరగా వేయాలి.

– డ్యాంగిన రామారావు, బర్దీపూర్